క్లుప్తంగా

పేద మైనార్టీ కుటుంబాలకు ఉచిత విద్య



తాసీరియా 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముస్లిం మతపెద్దలు

ఉరవకొండ: జిల్లావ్యాప్తంగా పేద ముస్లిం కుటుంబాల్లో ఆడపిల్లలకు ఉచితంగా విద్య, వసతి కల్పించడమే లక్ష్యమని మదరసా అధ్యక్షుడు సయ్యద్‌తాసీర్‌బాబా తెలిపారు. సోమవారం స్థానిక జామీయా తాసీరియా మదరసా ఆవరణలో 2024 నూతన తాసీరియా క్యాలెండర్‌ను సయ్యద్ ఆజ్మతుల్లా హుసేనీ, కుతుబుద్దీన్ తఖీబాబా, షకీబ్ సాహెబ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. తాసీరియా ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ సొసైటీ నూతన క్యాలెండర్‌ను ప్రారంభించిన అనంతరం సయ్యద్‌తాసీర్‌బాబా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా రూ.40 లక్షల వ్యయంతో పేద ముస్లిం కుటుంబాలకు చెందిన 7వ తరగతి నుంచి 10వ తరగతి చదివే అమ్మాయిలకు ఉచిత విద్య, వసతి కల్పించామన్నారు. జిల్లావ్యాప్తంగా ముస్లిం అమ్మాయిలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాసిరియా ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

‘శ్మశాన వాటిక ఏర్పాటు చేయండి’

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లి, మాలేపల్లిలో దళితులకు ప్రత్యేక శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప తదితరులు తహసీల్దార్ ఫణికుమార్‌కు గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టైలర్ వన్నూరుస్వామి, పార్లమెంట్ అధ్యక్షుడు తిమ్మరాజు, తాలూకా అధ్యక్షుడు లక్ష్మణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

9,10న యవనస్తుల సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న పాస్టర్ కిరణ్‌కుమార్

రాయదుర్గంటౌన్: కేఎస్‌సీసీ మినిస్ట్రీస్ ట్రస్ట్, రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చి యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీల్లో యవనస్తుల ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించనున్నట్లు పాస్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు చర్చి యూత్ సభ్యులతో కలసి ఆధ్యాత్మిక సదస్సు పోస్టర్లను సోమవారం చర్చిలో విడుదల చేశారు. దైవ సందేశం ఇచ్చేందుకు సదస్సుకు బ్రదర్ థామస్ హాజరవుతున్నారన్నారు. ఆధ్యాత్మిక సదస్సుకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మందు పిచికారీతో పంట నాశనం



పాడైన మిరపతోట చూపుతున్న రైతు షేక్ మహమ్మద్

శెట్టూరు: దుకాణం యజమాని ఇచ్చిన మందు పిచికారీతో మిరపతోట మాడిపోయిందని రైతు షేక్ ఇర్ఫాన్ గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ఫణికుమార్‌కు ఫిర్యాదు చేశాడు. రైతు తెలిపిన మేరకు.. 2 ఎకరాల్లో (పీహెచ్‌ఎస్ 2443) మిర్చి పంట సాగుచేశాడు. పంటకు తెగులు సోకడంతో అక్టోబర్ 26న కళ్యాణదుర్గం పట్టణంలోని ఓ ఫెస్టిసైడ్స్ షాపులో మందులు కొన్నాడు. ఆ మందు పిచికారీ చేసిన రెండు, మూడు రోజులకు మిరప తోట మొత్తం కాలిపోయినట్టి కాయలు, ఆకులు రాలిపోయాయి. మందుల షాపు నిర్వాహకులకు తెలియజేస్తే మాకు సంబంధం లేదన్నారు. రూ. లక్షల్లో నష్టపోయిన తనకు న్యాయం చేయాలని బాధిత రైతు అధికారులను కోరాడు.

పొంచి ఉన్న తుపాను ముప్పు



కూడేరు మండలం ముద్దాలపురం వద్ద మిర్చి పంటపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు

ఉరవకొండ: తుపాను ముప్పు పొంచి ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో అత్యధిక ధర పలుకుతున్న డబ్బిరకం మిర్చిను ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప, కూడేరు, విడపనకల్లు మండలాల్లో రైతులు అత్యధికంగా సాగుచేశారు. పంటను కోత కోసిన తరువాత కల్లాల్లో ఆరబోశారు. గత రెండు రోజులుగా రాష్ట్రం పై మిచౌంగ్ తుపాన్ తీవ్ర ప్రభావం చూపుతుండటంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కూడేరు మండలం ముద్దాలపురం, విడపనకల్లు, బెళుగుప్ప మండలాల్లో కల్లాల్లో ఆరబోసిన పంటపై టార్పాలిన్లు కప్పుతూ పంటను కాపాడేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుతం మార్కెట్లో డబ్బీ రకం మిర్చి క్వింటా రూ.60 వేల నుంచి రూ.70 వేలు పలుకుతోంది. వర్షానికి తడిస్తే నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

బస్సుయాత్ర విజయవంతం చేయండి

- బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం
- టీడీపీవి దిగజారుడు రాజకీయాలు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రయోజనం కోసం గడిచిన నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ శ్రేణులంతా విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పార్టీ పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదరి గోవిందుతో కలసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం 2–3 గంటల మధ్య సామాజిక సాధికర బస్సుయాత్ర శాంతినగర్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి ప్రారంభమై వినాయక సర్కిల్ మీదుగా తేరు బజారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్దకు చేరుకుంటుందన్నారు. బస్సుయాత్ర విజయవంతం చేయడంతో పాటు 2024లో రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారని విప్ అన్నారు. సంక్షేమం నుంచి రాజ్యాధికారం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. క్యాబినెట్‌లో 17 మందికి చోటు కల్పించడంతో పాటు ఆయా వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు రాయదుర్గంలోనూ అత్యధిక ప్రాధన్యత కల్పించామన్నారు. టీడీపీ హయాంలో పేద వర్గాలకు చంద్రబాబు మోసం చేశాడని ధ్వజమెత్తారు. బాబు క్యాబినెట్‌లో ఒక్క ఎస్టీ ఎమ్మెల్యే లేడుజ మైనార్టీలకు చివరిదాకా మంత్రి పదవి ఇవ్వలేదు. ఆ వర్గాలను అణగదొక్కడంతో పాటు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నాడన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో ఆ సామాజిక వర్గాలు బాబుకు బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపారని గుర్తుచేశారు. 2024 లోనూ టీడీపీని బంగాళఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కాలవవి దిగజారుడు రాజకీయాలు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని విప్ ధ్వజమెత్తారు. రాయదుర్గంలో ఏ కార్యక్రమాన్నీ పట్టించుకోని ఈ మురికి కాలవకు ఎన్నికలు దగ్గరపడే కొద్దీ కొత్త ఆలోచనలు పుట్టుకొస్తున్నాయన్నారు. ఈ నెల 6న అంబేద్కర్ వర్ధంతి చేయాలనే తలచడం శోచనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీల ఓట్లు దండుకునేందుకే ఈ కుట్రకు తెరలేపాడన్నారు. చంద్రబాబు హయాంలో దళితులపై జరిగిన దాడులు, అఘాయిత్యాలు, అకృత్యాలు, మర్డర్లు నేటికీ యూట్యూబ్‌లో చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సోములాపురం లో ఉండే ఓ దుర్మార్గపు పచ్చనాయకుడి ఖాతాకు రూ.12 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. పేదలంతా సంక్షేమం వైపే నిలవాలన్నారు. టీడీపీ ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు.

ప్రముఖుల హాజరు

రాయదుర్గంలో తలపెట్టిన భారీ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషా, మంత్రులు కేవీ ఉషశ్రీ చరణ్, గుమ్మనూరు జయరాం, మేరుగ నాగార్జున, ఎంపీలు తలారి రంగయ్య, నందిగామ సురేష్, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్యేలు, పార్టీ ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై సామాజిక వర్గాల వారీగా సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తారన్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల తో పాటు ప్రభుత్వం నుండి లబ్ధి పొందిన వారంతా తరలివచ్చి మద్దతుగా నిలవాలన్నారు. ఈ సామాజిక విప్లవాన్ని చూసి ఇతర పార్టీల అభ్యర్థుల వెన్నులో వణుకు పుట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మైనార్టీ నాయకుడు ముస్తాక్, నాయకులు మేకల శ్రీనివాసులు, పొరాళ్ల శివ, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: మంగళవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు రాయదుర్గంలో బారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు, తోరణాలు, బడుగుల చిత్రాలతో ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున వెలిశాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ పెద్దపీట వేయడంతో.. ఆ రుణం తీర్చుకునేలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. జగన్ కే మా మద్దతు, జగన్ వెంటే తామంతా ఉంటామంటూ హోర్డింగులు నెలకొల్పారు. విప్ కాపు రామచంద్రారెడ్డి, తనయుడు కాపు ప్రవీణ్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 2:30 గంటలకు పార్టీ నాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత బైక్ ర్యాలీ
- మధ్యాహ్నం 3 గంటలకు శాంతినగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు.
- 3:30 గంటలకు బడుగు, బలహీన వర్గాలతో కలసి బస్సు యాత్ర ప్రారంభం
- 4 గంటలకు వినాయక సర్కిల్‌కు ఆ తర్వాత 4:30 గంటలకు తేరు ముందు ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్ద చేరుకుంటారు.
- గడిచిన నాలుగున్నరేళ్లలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కిన రాజ్యాధికారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు వివరిస్తారు.



బహిరంగ సభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కాపు ప్రవీణ్‌రెడ్డి



పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

‘ఆడుదాం ఆంధ్రా’లో నమోదు చేసుకోండి



కంబదూరు: క్రీడా పరికరాలను అందజేస్తున్న దృశ్యం



గుమ్మఘట్ట: మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహమూర్తి

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులుల్లో క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ షకీలాబేగం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 15 ఏళ్లు నిండి ఆసక్తి గలిగిన వారు www.aadudamandhra.ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15 నుంచి పోటీలు ప్రారంభం అవుతాయన్నారు.

గుమ్మఘట్ట: ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, పీఈటీలు,పీడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లు పైబడిన ఆసక్తిగల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఎంఈఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ళ నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్ సూచించారు.సోమవారం మండల కేంద్రంలో ఆడుదాం..ఆంధ్రా పోటీలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రచారం నిర్వహించారు.అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా పరికరాలను సచివాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఎంపీటీసీ మల్లేష్, ఆలయ ధర్మకర్త మల్లూరి వెంకటేశులు, వార్డు మెంబర్లు పవన్, వడ్డే రాజు, సచివాలయ కన్వీనర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన క్రీడా కిట్లు

కూడేరు: యువతలో, గ్రామీణుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘ఆడుదాం ఆంధ్రా’ పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. ఆ క్రీడా పోటీలకు సంబంధించిన కిట్లు సోమవారం మండలానికి సరఫరా అయ్యాయి. అధికారులు వాటిని కూడేరులోని సచివాలయంలో ఉంచారు.వాలీబాల్, బ్యాట్మిటన్, క్రికెట్ , కబడ్డీ, ఖోఖోకు సంబంధించిన కిట్లు వచ్చినట్లు ఎంపీడీఓ ఎంకే బాషా తెలిపారు. ఈ కిట్లను మండలంలోని 11 సచివాలయాలకు సరఫరా చేస్తామన్నారు.

మళ్లీ సీఎంగా జగనే కావాలి



విడపనకల్లు మండలం ఉండబండలో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ,సర్పంచు,అధికారులు



కణేకల్లు మండలం జక్కలవడికిలో జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విడపనకల్లు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎంగా ఉండాలని ఎంపీపీ కరణం పుష్పావతి అన్నారు. సోమవారం మండలంలోని ఉండబండ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచు అన్నపూర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మంచి జరగాలన్నా, సంక్షమ పథకాలు కొనసాగాలన్నా భవిష్యత్తులో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండాలన్నారు. అనంతరం అభివృద్ధి పథకాల బోర్డుతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, ఎంపీటీసీ ఓబుళేసు, సచివాలయ కన్వీనర్ చిదానంద, నాయకులు ప్రకాష్‌గౌడు, ఓబుళప్ప,సచివాలయ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో మరోమారు సీఎంగా జగన్మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలని మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జక్కలవడికిలో సోమవారం ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, సర్పంచు శారదమ్మతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, మాజీ సర్పంచు గిర్రప్పరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, టైలర్ వెంకటేశులు, భీమిరెడ్డి, కెనిగుంట రామిరెడ్డి పాల్గొన్నారు.

కుందుర్పి: జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, కోఆప్షన్ సభ్యుడు ముజీ అన్నారు. సోమవారం మండలంలోని నిజవల్లి పంచాయితీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, సర్పంచ్ ప్రభాకర్, సచివాలయ కన్వీనర్ రాము, ఎంపీటీసీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చైన్ స్నాచింగ్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో కాళికాంబ అమ్మవారి ఆలయం సమీపంలో నివాసముంటున్న మహిళ సుధాలక్ష్మి మెడలో మూడుతులాల బంగారు గొలుసును సోమవారం గుర్తుతెలియని దుండగులు బలవంతంగా లాక్కొని బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

త్వరలో రైతులకు పరిహారం

గుమ్మఘట్ట: గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ జనవరిలోగా ప్రభుత్వం పరిహారం అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలవ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో 6,504 మంది రైతులకు నష్టం జరిగిందన్నారు. వేరుశనగ 7,482 హెక్టార్లు, పత్తి 78 హెక్టార్లు, ఆముదం 194 హెక్టార్లు, కంది 165 హెక్టార్లు, ఇతర పంటలు 81 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలకు పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

దుర్గానికి తప్పిన నీటిగండం..!

- సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు జలకళ
- విప్ చొరవతో అదనపు మోటార్లు, పైప్‌లైన్‌తో నీటిపంపింగ్

రాయదుర్గంటౌన్: పట్టణవాసులకు నీటి గండం తప్పింది. రాయదుర్గం పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్న కణేకల్లులోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు(ఎస్ఎస్ ట్యాంకు) జలకళ సంతరించుకుంది. హెచ్చెల్సీలో తుంగభద్ర జలాల సరఫరా నిలిచిపోయే నాటికి ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటిమట్టం 3050 మిలియన్ లీటర్లు కాగా ఇటీవల పూర్తిస్థాయికి చేరుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్ తెలిపారు. పట్టణానికి ఒకసారికి 11 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తుండగా అదే నిష్పత్తితో హెచ్చెల్సీ కాలవకు నీటి సరఫరా నిలిపివేసినా బ్యాక్ వాటర్ ఉన్నంత వరకూ ట్యాంకులో నీటి పంపింగ్ జరుగుతుందన్నారు. హెచ్చెల్సీలో డిసెంబర్ 5 వరకూ బ్యాక్ వాటర్ లభించే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని జీఎల్ఎస్ఆర్‌లకు నీటి పంపింగ్‌ను బట్టి కాలనీల వారిగా నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మూడురోజులకోసారి నీటిసరఫరా చేస్తామన్నారు. వచ్చే ఏడాది జులై వరకు పట్టణవాసులకు నీటి కొరత ఉండదని, ముఖ్యంగా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

విప్ చొరవతో..

టీబీ డ్యాంలో నీటి కొరతతో రెండు నెలల ముందుగానే హెచ్చెల్సీకి నీటి పంపింగ్ నిలిచిపోతున్న తరుణంలో సాధ్యమైనంత త్వరగా కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్ చేయాల్సిన పరిస్థితి. కానీ కేవలం మూడు మోటార్ల ద్వారా సాధ్యమయ్యే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో సాధ్యమైంది. మూడు మోటార్ల స్థానంలో అదనంగా మరో 60 హెచ్‌పీ, 20 హెచ్‌పీ, 10 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లతో పాటు మరో పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. నిరంతరం ఆరు మోటార్ల ద్వారా నీటి పంపింగ్ కొనసాగడంతో కాలవలో నీరు బంద్ చేసే సమయానికి ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఎస్ఎస్ ట్యాంకుకు సకాలంలో నీటి పంపింగ్ చేయించి వచ్చే ఏడాది వరకూ నీటి గండం నుంచి తప్పించిన విప్ మున్సిపల్ పాలకవర్గానికి పట్టణవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



తుంగభద్ర జలాలతో జలకళ సంతరించుకున్న పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు



ట్యాంకులోకి అదనపు పైప్‌లైన్‌తో నీటి పంపింగ్ దృశ్యం

సంక్షిప్త సమాచారం

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

కూడేరు: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సోమవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఐఈఆర్టీ మస్తాన్ వలి, ఐడీఎస్ఎస్ రమేష్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అమర్‌నాథ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రతిభావంతుల దినోత్సం సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వాణిశ్రీ , ఆర్డీటీ ఏటీఎల్ నారాయణ స్వామి, ఏఓ నందకిశోర్, బాలాజీ దివ్యాంగుల మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవనం ప్రారంభం

విడపనకల్లు: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విడపనకల్లుల దివ్యాంగుల నూతన భవనాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ సకలాంగులతో సమానంగా దివ్యాంగులు రాణిస్తున్నారన్నారు. ఎంపీపీ దంపతులు పుష్పావతి, భీంరెడ్డి సహకారంతో భవనం నిర్మాణం పూర్తయిందని దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకన్న, గిరిబాబు, దివ్యాంగుల సంఘం నాయకులు, ఏపీఎం రాంమోహన్, ఎంపీటీసీలు ఓబుళేసు, తిమ్మరాజు, మహేశ్, హనుమంతుయాదవ్ పాల్గొన్నారు.

నివాళి

శెట్టూరు: అనారోగ్యంతో మృతిచెందిన ఆర్డీటీ మాజీ హెల్త్ డైరెక్టర్ సుధీర్‌రావు భౌతికకాయానికి ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలా ఫెర్రర్ నివాళులర్పించారు. సోమవారం చింతర్లపల్లిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఆమెతో పాటు, ఆర్డీటీకి చెందిన అన్ని శాఖల డైరెక్టర్లు, సిబ్బంది, పలు ప్రజా సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరయ్యారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటామని ఆమె ధైర్యం చెప్పారు.

ఇంట్లో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మారెంపల్లి కాలనీలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తిమ్మరాజు వివరాల మేరకు.. మూడు రోజుల క్రితం ఇంటి తాళం వేసి దర్గా హొన్నూరు ఉత్సవాలకు కుటుంబంతో కలసి వెళ్లాడు.సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి తాళం తీసి ఉండడంతో పోలీసులకు సమాచామిచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. రూ.3 లక్షల నగదుతో పాటు 2 తులాల బంగారం పోయిందని బాధితుడు తిమ్మరాజు వాపోయాడు.

16న మండల సమావేశం

రాయదుర్గం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలంయలో ఈనెల 16న ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య సోమవారం తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులతో పాటు అధికారులు హాజరు కావాలన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ గేట్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపులపర్తికి చెందిన హెచ్.శివన్న (32 అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు. అతడు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. బళ్లారిలో ప్రయాణికులను దించి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. హిర్దేహాళ్ సమీపాన స్పీడ్‌బ్రేకర్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో శివన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడితో కలసి ప్రయాణిస్తున్న జొజ్జన్నగౌడకు స్వల్ప గాయాలయ్యాయి. బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ శివన్న మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



అలంకరణలో జంబుకేశ్వరుడు



పూజలందుకున్న నీలకంఠేశ్వరుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆలయాల్లో కార్తీకమాసం మూడో సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామి ఆలయంలోవారికి అభిషేకాలు చేపట్టారు. కుబేర కుంకుమతో స్వామిని అలంకరించారు. అలాగే కోటలో వెలసిన నగరేశ్వరస్వామి ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. చన్నవీరస్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయం, బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సామూహిక దీపోత్సవం



దీప పూజలో పాల్గొన్న మహిళలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మహిళలతో సామూహిక కార్తీక దీపపూజ కార్యక్రమం నిర్వహించారు. సోమ వంశీయుల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం చేపట్టారు. పూజలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు అరవా శివప్ప, ప్రధాన కార్యదర్శి చెంచులునాగప్ప, ధర్మకర్త ముకుంద, ఉపాధ్యక్షులు సోమా పాండు, వెంకటేశులు, హనుమంత, సిద్దప్ప, సహాయ కార్యదర్శి ప్రసాద్, ప్రచార కార్యదర్శి గురు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన జోడులింగాల ఆలయం



జోడు లింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. పురోహితులు శివశంకర్ శాస్త్రి , మహేష్, ప్రవీణ్ స్వామి తదితరులు జోడు లింగాలకు రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ధ్వజ స్తంభం ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా సహస్ర లింగార్చన



లింగార్చనలో పాల్గొన్న భక్తులు

కుందుర్పి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక బొమ్మరాయ ఆలయంలో సహస్ర లింగార్చన, అభిషేకం, మాలధారణ కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు సాయంత్రం ఆలయంలో లింగార్చన చేపట్టారు. గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలతో ఉత్సవం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై నేడు సమావేశం

కళ్యాణదుర్గం రూరల్/శెట్టూరు/బెళుగుప్ప/బెళుగుప్ప: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేపై ఉన్నతాధికారులతో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాలమాన్ సోమవారం తెలిపారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు. అలాగే శెట్టూరు, బెళుగుప్ప మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై సమవేశం నిర్వహిస్తామని ఎంపీడీఓలు రఘురామరావు, రామచంద్ర తెలిపారు. అదేవిధంగా బొమ్మనహాళ్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఎంపీడీఓ షకీలాబేగం సోమవారం తెలిపారు.